సాక్షి
ఏలూరు
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో బుధవారం సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా జరిపించారు.



ఉయ్యాలవాడకు నివాళి

తాడేపల్లిగూడెం: పోరాట యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలో నిర్వహించారు.



నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు భోగరాజు బ్రహ్మాజీరావు (పూనె) బుధవారం రూ.50,001ను విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. స్థానిక అమీనాపేటలోని ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి హాస్టల్‌లో అందిస్తున్న ఆహారం, వైద్య సేవలు, పరిసరాల శుభ్రత, డ్రైనేజీ వ్యవస్థ వంటి విషయాలపై ఆరా తీశారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్యానల్ న్యాయవాదులు, వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు



మాట్లాడుతున్న సెట్‌వెల్ సీఈఓ

చింతలపూడి: గ్రామీణ యువతకు అవసరమైన కార్యక్రమాల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లా సెట్‌వెల్ సీఈఓ ఎండీ హెచ్ మెహరాజ్ తెలిపారు. స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం యూత్ క్లబ్స్ ఫార్మేషన్‌పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో 10 నుంచి 15 మంది యువతీ, యువకులతో యూత్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వారి వయసు 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. చదువుతో సంబంధం లేకుండా యువతను ఎంపిక చేయాలన్నారు. సెట్‌వెల్ ద్వారా జాబ్‌మేళాలు, శిక్షణా తరగతులు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎంపీడీఓ మణికుమారి, సెట్‌వెల్ ఏఓ, పంచాయతీ విస్తరణ అధికారి పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ



ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ కోర్సుల్లో 3 నెలల స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమం నిమిత్తం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఫీల్డ్ టెక్నీషియన్‌- హోమ్ అప్లయెన్సెస్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఎలక్ట్రిక్ వెహికల్ అసెంబ్లీ టెక్నీషియన్, సోలార్ లైటింగ్ అసెంబ్లేర్ (ఎలక్టివ్ హోమ్ లైటింగ్ సిస్టమ్/ స్ట్రీట్ లైట్స్) కోర్సుల్లో శిక్షణ ఇస్తామని, 10వ తరగతి ఆ పైన విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వయసు 15 నుంచి 45 ఏళ్లు ఉండవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులతో ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పెద్దింట్లమ్మకు పంచహారతులు



అమ్మవారికి హారతులు ఇస్తున్న దృశ్యం

కైకలూరు: కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ జాతర బుధవారం రెండో రోజుకు చేరింది. ఉదయం జలదుర్గ సమేత పెద్దింటి అమ్మవారికి సుగంధ ద్రవ్యాభిషేకం, పంచఫల రసాభిషేకం, గంగోదక అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని వైఎస్సార్‌సీపీ నేత సయ్యపురాజు గుర్రాజు (భుజబలపట్నం) అందించారు. కట్టా లక్ష్మీ రత్నకుమారి భగవద్గీత పారాయణ ప్రవచనం, మట్టా శ్రీరాములు అధ్వర్యంలో శివరంజని నాట్యమండలి సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ కేవీ గోపాలరావు మాట్లాడుతూ జాతర 15 రోజుల పాటు సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 3న జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

అట్టహాసంగా నామినేషన్ల దాఖలు

- వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా కవురు, వంకా నామినేషన్ల సమర్పణ
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- ఎమ్మెల్సీ స్థానాల్లో బడుగులకే పెద్దపీట
- నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ





నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, చిత్రాల్లో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు శ్రీరంగనాథరాజు, అబ్బయ్యచౌదరి, వెంకట్రావు

సాక్షిప్రతినిధి, ఏలూరు: స్థానిక సంస్థల కోటాలో శాసనమండలి సభ్యుల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ కీలక ఘట్టానికి చేరుకుంది. గురువారంతో నామినేషన్ల స్వీకరణ ముగియనుండటంతో బుధవారం అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అట్టహాసంగా ప్రజా ప్రతినిధులతో కలిసి వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు మొత్తం 4 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ మండలి అభ్యర్థులుగా జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, తణుకుకు చెందిన పారిశ్రామికవేత్త వంకా రవీంద్రనాథ్ పేర్లను ప్రకటించిన క్రమంలో వీరిద్దరూ బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎంపీపీ వీరవల్లి చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు చేశారు.

ఎన్నిక లాంఛనమే..

సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేస్తూ జిల్లాలో కీలకంగా ఉన్న బీసీలు, కాపులను శాసనమండలి అభ్యర్థులుగా అధికార వైఎస్సార్ సీపీ ప్రకటించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 85 శాతానికి పైగా స్థానిక సంస్థలు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. ఈ క్రమంలో పార్టీ ప్రకటించిన ఇద్దరు అభ్యర్థుల ఎన్నిక లాంఛనం కానుంది. అయితే బరిలో ప్రస్తుతానికి స్వతంత్ర అభ్యర్థిగా నల్లి రాజేష్‌కుమార్, టీడీపీ అభ్యర్థిగా వీరవల్లి చంద్రశేఖర్ నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది.

కోలాహలంగా.. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కోలాహలంగా ఏలూరు కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబుకు సమర్పించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, దెందులూరు, గోపాలపురం, అవనిగడ్డ ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, తలారి వెంకట్రావు, సింహాద్రి రమేష్‌బాబు, తణుకు, పాలకొల్లు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నేతలు హాజరయ్యారు.

బీసీలకు అధిక ప్రాధాన్యం: మంత్రి కారుమూరి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేబినెట్‌లో, శాసనమండలిలో, నామినేట్ పదవుల్లోనూ బీసీలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. గత పాలకులు పూర్తిగా రాజకీయాలను నిర్లక్ష్యం చేశారని, బీసీ కులాలన్నింటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలో బీసీ సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు.

బడుగుల కల సాకారం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ బడుగుల కలలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని, 18 శాసనమండలి స్థానాల్లో 11 మంది బీసీలకు అవకాశం కల్పించారని, అలాగే కేబినెట్‌లోనూ, మండలిలోనూ దళితులకు అధిక ప్రాధాన్యమిచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు.

వెనుకబడిన వర్గాలకు వెన్నుదన్ను

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు వైఎస్సార్‌సీపీ వెన్నుదన్నుగా ఉందని, ప్రజల దృష్టిలో టీడీపీ ఎప్పుడో చచ్చిపోయిందని, ఎల్లో మీడియా దృష్టిలోనే బతికి ఉందన్నారు.



నామినేషన్ కేంద్రం వద్ద వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం

2014 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయాను. 2019లో ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా నన్ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నియమించారు. రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి కృషి చేశాను. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి, నిబద్ధతతో ఉన్నవారికి సముచిత స్థానం దక్కుతుంది.

– వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ అభ్యర్థి

పాలకొల్లులో పాగా వేస్తాం

పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయనుంది. ఎన్టీఆర్, వైఎస్సార్‌లాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అండగా ఉన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు.

– కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ అభ్యర్థి

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్టు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో–ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.

ఏలూరు జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు

- యువజన విభాగం: పద్మావతి గిరిబాబు (చింతలపూడి)
- మహిళా విభాగం: వందనపు సాయిబాల పద్మ (చింతలపూడి)
- రైతు విభాగం: వాసిరెడ్డి మధుసూదనరావు (పోలవరం)
- బీసీ సెల్: ఘంటా ప్రసాదరావు (దెందులూరు)
- ఎస్సీ సెల్: తేరా ఆనంద్ (దెందులూరు)
- ఎస్టీ సెల్: కొవ్వాసు నారాయణ (పోలవరం)
- మైనార్టీ సెల్: రాజా అహ్మద్ (ఏలూరు)
- స్టూడెంట్ వింగ్: ఐరదల రామకృష్ణ విహారి (ఏలూరు)
- వైఎస్సార్‌టీయూసీ: పాలడుగు మురళీ శ్యామ్ (ఏలూరు)
- వాణిజ్య విభాగం: అంబికా రాజా (ఏలూరు)
- సాంస్కృతిక విభాగం: మారిశెట్టి కృష్ణమూర్తి (అబ్బులు) (ఉంగుటూరు)
- వైఎస్సార్ సేవాదళ్: బలే నాగరాజు (కైకలూరు)
- ప్రచార విభాగం: పోలనాటి శ్రీనివాసబాబు (చింతలపూడి)
- క్రిస్టియన్ మైనార్టీ సెల్: పిల్లా చరణ్ (నూజివీడు)
- పంచాయతీరాజ్ వింగ్: పుప్పాల గోపి దుర్గారాజేంద్రప్రసాద్ (ఉంగుటూరు)
- గ్రీవెన్సెస్ సెల్: డాక్టర్ కేవీఎస్ రామకృష్ణ (చింతలపూడి)
- వీవర్స్ వింగ్: దొంతంశెట్టి సత్యనారాయణ (ఉంగుటూరు)
- డాక్టర్స్ వింగ్: డాక్టర్ ఏవీఎస్ పద్మరాజు (ఏలూరు)
- ఐటీ వింగ్: గూడపాటి శ్రీనివాస పవన్‌కుమార్ (దెందులూరు)
- వికలాంగుల విభాగం: కల్లా నాగేశ్వరరావు (ఏలూరు)

శివరాత్రి ఆదాయం రూ.29.25 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కైకలూరు(కలిదిండి): స్థానిక పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా రూ.29,25,472 ఆదాయం లభించినట్టు ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు చెప్పారు. ఏలూరు జిల్లా దేవదాయ శాఖ అధికారి సీహెచ్ రంగారావు, గుడివాడ దేవదాయ శాఖ తనిఖీదారు వి.సుధాకర్, ఆలయ చైర్మన్ అడవి వెంకట గంగాధర్ శర్మ, ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో బుధవారం ఆలయంలో ఆదాయాన్ని లెక్కించారు. వీఐపీ, ప్రత్యేక దర్శనాలు, షాపు అద్దెలు, కొబ్బరి చెక్కల లైసెన్సు, అభిషేకం, వాహన పార్కింగ్, లడ్డూ ప్రసాదం, హుండీల ద్వారా ఆదాయం వచ్చిందన్నారు. గత శివరాత్రికి రూ.25,40,651 ఆదాయం రాగా ఈ ఏడాది మరింత పెరిగిందన్నారు.

రీ సర్వే పనులు వేగవంతం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జిల్లాలో భూ రీసర్వేకి సంబంధించిన స్టోన్ ప్లాంటేషన్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరం నుంచి జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి జిల్లాలోని సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్టోన్ ప్లాంటేషన్, ఎస్సీ శ్మశాన వాటికకు గుర్తించిన భూమి, ల్యాండ్ కన్వర్షన్, పరిశ్రమల యూనిట్ల ఏర్పాటుకు గుర్తించిన ల్యాండ్, ముఖ ఆధారిత హాజరు, కంటెంట్ కోర్టు కేసులు, రెవెన్యూ, సర్వేకి సంబంధించిన స్పందన అర్జీలు, చెరువుల ఆక్రమణలపై చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు.

మండలాల వారీగా..

భూ సర్వేకి సంబంధించిన స్టోన్ ప్లాంటేషన్‌పై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. 15 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక ద్వారా 50 శాతం పూర్తి చేసి, నివేదికను పంపాలన్నారు. జిల్లాలో భూ హక్కు పత్రాలు పంపిణీలో జాప్యంపై తహసీల్దార్లను ప్రశ్నించారు. జిల్లాలో 35 గ్రామాల్లో ఎస్సీ శ్మశాన వాటికలకు గుర్తించిన భూమిని పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీఓ, ఈవోపీఆర్డీ సమక్షంలో హ్యాండ్ ఓవర్ చేయాలని ఆదేశించారు. ల్యాండ్ కన్వర్షన్ పెండింగ్ లిస్టును పంపాలని ఆదేశించారు. చిన్న పరిశ్రమల ఏర్పాటుకు గుర్తించిన ప్రభుత్వ భూమి వివరాలపై, ఆధార్ కార్డుకు ఓటరు ఐడీ కార్డు అనుసంధాన ప్రక్రియపై సమీక్షించారు. ప్రభుత్వ ఉద్యోగుల నూరు శాతం ముఖ ఆధారిత హాజరు నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్ఓ ఏవీఎస్ఎస్ మూర్తి, ఏడీ సర్వేవెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

24న అథ్లెటిక్స్ పోటీలు

ఉంగుటూరు: జిల్లాస్థాయి అండర్–18 అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 24న, రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 26న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించనున్నట్టు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ బుధవారం తెలిపారు. బాలురు, బాలికల జట్లు పోటీల్లో తలపడతాయని, క్రీడాకారులు సంబంధిత పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

హాస్టల్ విద్యార్థులకు వరం

- డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచుతూ జీఓ
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- విద్యార్థులు, నాయకుల హర్షం



ఏలూరు అమీనాపేటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల హాస్టల్

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. తాజాగా హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచుతూ జీఓలను విడుదల చేసింది. అదనంగా డైట్ చార్జీలకు రూ.132 కోట్లు, కాస్మోటిక్ చార్జీలకు రూ.48 కోట్లు కేటాయించింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్ 1 నుంచి పెంచిన చార్జీలు అమలులోకి వస్తాయి. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, తదితర సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు 2012లో అప్పటి ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచింది. గత ఎన్నికలకు ముందు (2018) టీడీపీ ప్రభుత్వం హడావుడిగా నామమాత్రంగా డైట్ చార్జీలను పెంచినా అవి అమల్లోకి రాలేదు. నాటి నుంచి ఇప్పటివరకూ హాస్టల్ విద్యార్థులకు పాత చార్జీలనే అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

జిల్లాలో హాస్టళ్లు ఇలా..

ఏలూరు జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు 58, బీసీ హాస్టళ్లు 22, ఎస్టీ హాస్టళ్లు 6 ఉన్నాయి. అలాగే దివ్యాంగులు, చట్టంతో విభేదించిన వా హాస్టళ్లు, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల రెసిడెన్షియల్ హాస్టళ్లు కూడా ఉన్నాయి. మొత్తంగా జిల్లాలో అన్నిరకాల వసతి గృహాలు 95 వరకూ ఉన్నాయి. ఏటా ఆయా హాస్టళ్లలో 20 వేలకు పైగా విద్యార్థులు ఉంటున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వీరందరికీ ప్రయోజనం చేకూరనుంది.

డైట్ చార్జీలు ఇలా..

తరగతులు	ప్రస్తుతం	పెంపు
3,4 తరగతులు	రూ.1,000	రూ.1,150
5 నుంచి 10 తరగతులు	రూ.1,250	రూ.1,400
ఇంటర్ ఆపై..	రూ.1,400	రూ.1,600

కాస్మోటిక్ చార్జీలు

3 నుంచి 6 తరగతులు		
బాలురు	రూ.100	రూ.125
బాలికలు	రూ.110	రూ.130
7 నుంచి 10 తరగతులు		
బాలురు	రూ.125	రూ.150
బాలికలు	రూ.160	రూ.200
ఇంటర్ ఆపై..		
బాలురు	రూ.125	రూ.200
బాలికలు	రూ.160	రూ.250

అభినందనీయం



హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుదల అభినందనీయం. ఇదే సమయంలో బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మరింత పెంపుదల చేస్తే బాగుంటుంది. ఏటా ధరలపై సమీక్షిస్తూ నిర్ణయం తీసుకోవాలి.

– కె.లెనిన్, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ, ఏలూరు జిల్లా

పేద విద్యార్థులకు మేలు



హాస్టల్‌లోని కాలేజీ విద్యార్థులకు నెలకు రూ.1,400 మెస్ చార్జీలుగా ఇస్తున్నారు. ఇకపై రూ.200 పెంచుతూ అందిస్తామనడం ఆనందంగా ఉంది. పేద విద్యార్థులకు సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందనడానికి ఇదే నిదర్శనం.

– ఎ.శామ్యూల్ పాల్, బీఈడీ విద్యార్థి, సీఆర్ఆర్ కళాశాల, ఏలూరు

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



పేద,బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు మేలు చేసేలా తీసుకున్న నిర్ణయానికి సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుదల మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– సీహెచ్ శామ్యూల్, డిప్లొమా విద్యార్థి, సీఆర్ఆర్ కళాశాల, ఏలూరు

త్రోబాల్‌లో జయకేతనం



సత్తాచాటిన బాలికల జట్టు

తాడేపల్లిగూడెం: కేరళలోని ఎర్నాకుళంలో జరిగిన త్రోబాల్ పోటీల్లో జిల్లా త్రోబాల్ బాలురు, బాలికల జట్లు సత్తాచాటాయని అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ఏఆర్‌కే వర్మ బుధవారం ఇక్కడ తెలిపారు. ఈనెల 18,19 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి అండర్–19 త్రోబాల్ పోటీల్లో జిల్లా జట్లు తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. అలాగే కేరళలోనే జరిగిన 15వ సౌత్‌జోన్ జాతీయస్థాయి త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పురుషుల జట్టు ద్వితీయ, మహిళల జట్టు తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. జిల్లా నుంచి వెళ్లిన జట్టులో తొమ్మిది మంది క్రీడాకారులు ప్రతిభ కనబర్చారన్నారు.

కొనసాగిన ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన ఇంటర్ ప్రయోగ పరీక్షలకు 2,342 మంది విద్యార్థులకు 2,077 మంది హాజరయ్యారు. 25 కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షకు 1,202 మందికిగాను 1,030 మంది, మధ్యాహ్నం 1,140 మందికి 1,047 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు తెలిపారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


ఇందు (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాస పురంలో ఒక వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంటిపూడి ఇందు (23)కు ఇదే గ్రామానికి చెందిన కంటిపూడి సాయిరామ్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక బాబు ఉన్నాడు. సాయిరామ్ ప్రతి రోజు ఆలస్యంగా ఇంటికి వస్తుండటం, అతనిపై పోలీసు కేసులు ఉండటంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ తలెత్తింది. విషయం తెలుసుకున్న ఇందు తండ్రి ప్రసాద్ బుధవారం ఇంటికి వచ్చి ఇద్దరికి సర్ది చెప్పాడు. ప్రసాద్ ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే సాయిరామ్ కుటుంబ సభ్యులు ఫోన్ చేసి ఇందు ఆత్మహత్య చేసుకుందని చెప్పడంతో హుటాహుటిన వెళ్లి చూడగా ప్రాణం ఉందనుకుని జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త సాయిరామ్, అత్త, మామల వేధింపుల కారణంగానే తన కుమార్తె ఇందు మృతి చెందిందని తండ్రి ప్రసాద్ జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. మృతురాలి భర్త సాయిరాం పరారీలో ఉన్నాడు.

ఎస్‌పీఎల్ రీజనల్ విజేతలు సీఆర్‌ఆర్, ఎన్‌ఆర్‌ఐ

- ముగిసిన రీజనల్ క్రికెట్ పోటీలు
- సీనియర్ విభాగంలో సర్ సీఆర్‌ఆర్
- జూనియర్ విభాగంలో ఎన్‌ఆర్‌ఐ గెలుపు
- నేటి నుంచి విజ్ఞాన్స్‌లో రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లు


రిజిస్ట్రార్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మీడియా గౌరిశంకర్, సాక్షి బీఎం గోపి నుంచి ట్రోఫిని అందుకుంటున్న సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు


జూనియర్ విభాగంలో రన్నర్ ట్రోఫిని అందుకుంటున్న ఏలూరు సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కళాశాల జట్టు

Regional Sponsor
APMDC | APMDC FOUNDATION

చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) రీజనల్ స్థాయి జూనియర్స్, సీనియర్ స్థాయి పురుషుల క్రికెట్ పోటీలు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం ఉత్కంఠభరితంగా ముగిశాయి. రెండో రోజు నిర్వహించిన మూడు మ్యాచ్‌లలో ఆరు జట్లు మధ్యపోరు హోరాహోరీగా సాగాయి. రీజనల్ స్థాయి విజేతల బహుమతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మీడియా ఎ.గౌరిశంకర్ రావు, గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచి మేనేజర్ టీ గోపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ క్రీడాకారులు మాత్రమే వరల్డ్ చాంపియన్స్ అవ్వగలరని, క్రీడల్లో రాణింపుతోనూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చున్నారు. శారీరక శ్రమ కలిగే విధంగా ఆటలు ఆడటం వలన విద్యార్థులకు ఆరోగ్యం లభిస్తుందన్నారు. క్రీడల ద్వారా ఎంతోమంది ఉన్నత స్థానాలకు వెళ్లి దేశ ప్రతిష్టను పెంచారని గుర్తు చేశారు. మానసిక ఉల్లాసం కోసం వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మ్యాచ్‌లను గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచి మేనేజర్ టీ గోపీ పర్యవేక్షించారు.

SAKSHI PREMIER LEAGUE

నాకౌట్ మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి విజయదుందుభి

రీజనల్ మ్యాచ్ జూనియర్స్ విభాగంలో నిర్వహించిన నాకౌట్ మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి (ఏలూరు) కాలేజీ విజయదుందుభి మోగించింది. మొదట టాస్ గెలిసి సర్ సీఆర్ రెడ్డి టీమ్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కల్లం హరనాథరెడ్డి (గుంటూరు) కాలేజీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్ నందు 21 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్స్)తో రాణించాడు. సర్ సీఆర్ రెడ్డి కాలేజీ బౌలర్ కే గణేష్ 3 వికెట్లతో మెరిశాడు. అనంతరం 64 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి కాలేజీ కేవలం 5 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 64 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. సర్‌సీఆర్ రెడ్డి కాలేజీ బ్యాట్స్‌మెన్ ఎస్‌కే సాయిచరణ్ 36 పరుగులు (4 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో మెరిపించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP

అలవోకగా నెగ్గిన సర్ సీఆర్ రెడ్డి

సాక్షి ప్రీమియర్ లీగ్ సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ(ఏలూరు) రీజనల్ విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ (నెల్లూరు) నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సర్ సీఆర్ రెడ్డి కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. సర్ సీఆర్ రెడ్డి టీమ్‌లో నాగవెంకట తేజ 32 (3 ఫోర్ల) పరుగులతో రాణించారు. ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ బౌలర్లలో మనోజ్, అమర్‌నాథ్ చెరో రెండు వికెట్లతో రాణించారు. అనంతరం 96 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 43 పరుగులు మాత్రమే చేసి 52 పరుగుల తేడాతో ఓటమి చెందింది. సర్ సీఆర్ రెడ్డి కళాశాల బౌలర్లు హేమంత్, ఉమేష్, మధు ఒక్కొక్కరు రెండు వికెట్లతో రాణించారు. 32 పరుగుల చేసిన నాగవెంకట తేజ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

జూనియర్స్ రీజనల్ విజేత ఎన్‌ఆర్‌ఐ

సాక్షి ప్రీమియర్ లీగ్ జూనియర్స్ విభాగంలో ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ(విజయవాడ) విజేతగా నిలిచింది. రన్నర్‌గా సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ (ఏలూరు) రన్నర్‌గా నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ 53 పరుగులతో (5 ఫోర్లు, 1 సిక్స్) దుమ్మురేపాడు. అనంతరం 94 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 72 పరుగులు మాత్రమే చేసి 21 పరుగుల తేడాతో ఓటమి చెందింది. సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ బ్యాట్స్‌మెన్, కెప్టెన్ కే సాయి చరణ్ 18 పరుగులు (2 ఫోర్లు) మాత్రమే రాణించాడు. ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ నలుగురు బౌలర్లు జాఫర్, ప్రకాష్, తేజదీప్, రేవంత్ తలో 2 వికెట్లు తీసి సమష్టి కృషితో విజయంలో కీలకపాత్ర పోషించారు. బ్యాటింగ్‌లో 53 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభ కనపరిచిన ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లు

- సీనియర్స్ విభాగంలో సీకామ్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి) వర్సస్ ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (విజయనగరం)
- జూనియర్స్ విభాగంలో సాయి గణపతి కాలేజ్ (విశాఖపట్నం) వర్సస్ ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ (విజయవాడ)
- సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ (ఏలూరు) వర్సస్ సీకామ్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి)

గడపగడపకు సంక్షేమం


కైకలూరు(కలిదిండి): కలిదిండి మండలం వెంకటాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు

735 కిలోల గంజాయి స్వాధీనం

- కలపర్రు టోల్‌ప్లాజా వద్ద తనిఖీల్లో పట్టివేత
- లారీ ప్రత్యేక క్యాబిన్‌లో 21 బస్తాల్లో రవాణా
- ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ వెల్లడి


ఏలూరులో విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు టౌన్: కంటెయినర్ వ్యాన్‌లో ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేసి భారీగా గంజాయి రవాణా చేస్తున్న ఓ ముఠా గుట్టును పెదపాడు పోలీసులు రట్టు చేశారు. తమకు అందిన పక్కా సమాచారంతో కలపర్రు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టి విశాఖ ఏజెన్సీ నుంచి చెన్నైకు 21 బస్తాల్లో తరలిస్తున్న రూ.74 లక్షల విలువైన 735 కిలోల గంజాయిని పట్టివేశారని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు.

తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న ముఠా

తమిళనాడు రాష్ట్రం తుట్టికుడి ప్రాంతానికి చెందిన శివ అనే వ్యక్తి తుని ఏరియాకు వెళ్లి ఆ ప్రాంతానికి చెందిన సన్యాసిరావుతో ఒప్పందం చేసుకుని విశాఖ ఏజెన్సీ నుంచీ వ్యాన్‌లో భారీగా గంజాయి తరలించేందుకు పక్కా ప్రణాళిక వేశారు. కంటెయినర్ వ్యాన్‌లో ప్రత్యేకంగా ఒక క్యాబిన్ ఏర్పాటు చేసి 21 బస్తాల్లో 735 కిలోల గంజాయిని లోడ్ చేశారు. ఈ సరుకును మురళీ బాల కృష్ణన్ అనే వ్యక్తి తీసుకువెళ్లి శివ చెప్పిన ప్రకారం చెన్నైకు చెందిన మొహమ్మద్ అలీ అనే వ్యక్తికి అప్పగించేందుకు బయలుదేరాడు. పోలీసులకు వచ్చిన సమాచారంతో పెదపాడు మండలం జాతీయ రహదారిపై కలపర్రు టోల్‌ప్లాజా వద్ద సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పెదపాడు ఎస్సై నాగబాబు, సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానం వచ్చిన పోలీసులు కంటెయినర్ వాహనాన్ని తనిఖీ చేయగా వెనుక భాగంలో గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. వ్యాన్‌లో ఉన్న తమిళనాడు చైన్నై రెడ్‌హిల్స్ అన్న స్ట్రీట్ ప్రాంతానికి చెందిన మురళీబాలకృష్ణన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో మిగిలిన తమిళనాడు, విశాఖ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి. చాకచక్యంగా వ్యవహరించిన పెదవేగి సీఐ దుర్గాప్రసాద్, పెదపాడు ఎస్ఐ నాగబాబు, హెచ్‌సీ సువర్ణరాజు, కానిస్టేబుళ్లు దావాల ప్రదీప్, వి.నరేష్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

రైస్ మిల్లుపై విజిలెన్స్ దాడి

- అక్రమంగా నిల్వ చేసిన 43 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం
- రైస్ మిల్లు యాజమాని, దళారీలపై కేసు నమోదు


బియ్యం పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ, ఎస్సైలు

భీమడోలు: గుండుగొలనులోని గాయత్రి ట్రేడర్స్ రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.7.74 లక్షల విలువైన 43 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఈ మిల్లుకు రేషన్ బియ్యం వచ్చినట్లు జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్‌కు సమాచారం అందింది. డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ యూజే విల్సన్, ఎస్సైలు నాగరాజు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. గుండుగొలనుకు చెందిన గాయత్రి ట్రేడర్స్‌కు తాడేపల్లిగూడెంకు చెందిన రామకృష్ణ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని ఇళ్ల వద్ద సేకరించి తీసుకువచ్చి రైస్‌మిల్లుకు విక్రయించాడు. ఈ బియ్యానికి మిల్లులో పాలిష్ పెట్టి ప్రత్యేకంగా ముద్రించిన 860 సంచుల్లో నిల్వ ఉంచి లారీలో కాకినాడలోని లెవిన్ ఇండస్ట్రీస్ ట్రేడర్స్‌కు పంపేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్, ఇతర అధికారులతో కలిసి మిల్లుపై దాడి చేశారు. బియ్యం బస్తాలను తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీతో పాటు బరువు తూచే మిషన్, రెండు సంచులు కుట్టే యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఏలూరు ఏఎస్‌వో లక్ష్మణబాబుకు అప్పగించారు. రైస్‌మిల్లు యాజమాని బాదర్వాడ పృథ్వీరాజ్, తాడేపల్లిగూడెంకు చెందిన దళారీ రామకృష్ణలపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో సీఎస్‌డీటీ ఏ.మాధవరావు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు యజమాని టీడీపీ నేత

గుండుగొలనులోని గాయత్రీ ట్రేడర్స్ రైస్‌మిల్లు టీడీపీ నేత బాదర్వాడ పృథ్వీరాజ్‌కు చెందినది. గత కొంత కాలంగా ఈ మిల్లులో రేషన్ బియ్యానికి పాలిష్ పెట్టి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. తాడేపల్లిగూడెంకు చెందిన రామకృష్ణ రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు ప్రజల నుంచి కొని ఇక్కడ విక్రయిస్తున్నాడు. ఒకొక్క కేజీ రూ.13కు కొనుగోలు చేసి తిరిగి ఆ బియ్యాన్ని రూ.18 అమ్ముతున్నారు. వాటిని కొనుగోలు చేసి వాటికి పాలిష్ పట్టి సంచుల్లో వాటిని నింపి కాకినాడకు తరలిస్తున్నారు.

లోపూడిలో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ముసునూరు: మండలంలోని లోపూడిలో ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని కోటగిరి శేషగిరిరావు ఇంట్లో అతనితో పాటు భార్య, మామ ఉంటున్నారు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు లోనికి ప్రవేశించి రూ.3.45 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు అపహరించారు. బుధవారం ఉదయం వారు గమనించగా, బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అంకబాబు, ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌లకు రప్పించి ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, బంగారం సుమారు 30 కాసులు, వెండి నాలుగు కేజీల వరకు వెండి చోరీకి గురయ్యాయని బాధితులు చెబుతున్నట్లు తెలిసింది.

పోలీసులు, విలేకరులమంటూ వసూళ్లు.. ముగ్గురి అరెస్టు

భీమడోలు: పోలీసులు, విలేకరుల ముసుగులో రాత్రి వేళల్లో వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురు యువకులను బుధవారం భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు అరెస్ట్ చేశారు. అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని పాత అంబర్‌పేటకు చెందిన ఎం.రాజేష్, కె.నరేష్, ఆర్.లోకేష్ ముఠాగా ఏర్పడి పగలు కూలీ పనులు చేసుకుంటూ రాత్రి వేళల్లో అంబర్‌పేట, కురెళ్లగూడెం హైవేలపై తిరుగుతూ పోలీసులు, విలేకరులను చెప్పి వాహనదారులను అడ్డగించి వారి నుంచి డబ్బులు, వస్తువులు, సెల్‌ఫోన్లు లాక్కుంటున్నారు. ఓ బాధితుడు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురు యువకులను సీఐ అరెస్ట్ చేసి భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ద్వారకాతిరుమల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ చెప్పారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కొమ్మర గ్రామానికి చెందిన మానూరి వెంకన్న (60) ద్వారకాతిరుమలలోని తన జీడిమామిడి తోటలో ఈ నెల 17న సాయంత్రం పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతున్నాడు. కొమ్మర గ్రామ శివారులోని కుమ్మరి చెరువు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వేగంగా వస్తున్న ఒక స్కూటీ ఇతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకన్నను స్థానికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆటోలో ముందుగా ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించే నిమిత్తం శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ.శశిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని విద్యుత్ భవన్‌లో ఉదయం 10. 30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల మంజూరులో జాప్యం, బిల్లులో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు అంశాల్లో సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్‌తో పాటు సభ్యులు హరిబాబు, పి.శ్రీనివాస్, బాలాజీ ప్రసాద్ పాండే పాల్గొంటారని పేర్కొన్నారు.

కోర్టు ఉత్తర్వుల అమలు కోరుతూ డీలర్ల వినతి


ఏలూరులో డీఎస్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): రేషన్ డీలర్లకు సంబంధించి ఇటీవల కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. మండల్ లెవిల్ స్టాక్ పాయింట్ నుంచి రేషన్ డిపోలకు వచ్చే సరుకులకు డిపోలో దిగుమతి చేసేటపుడు డీలర్లపై దిగుమతి చార్జీల భారం లేకుండా ఆహార భద్రతా చట్టం అనుసరించి ఎటువంటి చార్జీలను వసూలు చేయరాదంటూ ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు ఉత్తర్వుల మేరకు రేషన్ డీలర్లపై దిగుమతి చార్జీల భారం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు తలారి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఏ.ఉదయేశ్వరరావు, జిల్లా వర్కింగ్ అధ్యక్షులు కేఎస్‌వీ ప్రసాద్, వెంకటేశ్వరరావు నాయక్, ఉపాధ్యక్షులు యూ.జయరాజు, కోశాధికారి నాగరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పి.రాజేశ్వరి, డివిజన్ అధ్యక్షులు రాజశేఖర్ పాల్గొన్నారు.

డీసీఈబీ కార్యదర్శికి అభినందనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఎ.సర్వేశ్వర రావును పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందచేసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఆయనను కలిసిన వారిలో వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర నాయకుడు గెడ్డం సుధీర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు బీఏ సాల్మన్‌రాజు, వి.రామ్మోహనరావు తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులపై కత్తిపీటతో దాడి

ఏలూరు టౌన్: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి వృద్ధులైన తల్లిదండ్రులపై కత్తిపీటతో దాడి చేయడంతో వారికి తీవ్రగాయాలయల్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు శివారు కొమడవోలులో నివాసం ఉంటున్న పున్నూరు భాస్కరరావు, పద్మ భార్యాభర్తలు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భాస్కరరావు కౌలు రైతు. చిన్న కుమారుడు సురేష్ మ్యూజిక్ ప్లేయర్. పెద్దకుమారుడు సతీష్‌కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న తల్లిదండ్రులు భాస్కరరావు, పద్మలపై కుమారుడు సతీష్ ఒక్కసారిగా కత్తిపీటతో దాడి చేసి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో ఉన్న వారిని 108 అంబులెన్సులో ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు.

చెప్పకుండా సొమ్ము తీసుకున్నాడని...

చెప్పకుండా సొమ్ము తీసుకున్నాడనే కోపంతో బాలుడిపై కన్నతల్లి, మారుటి తండ్రి, సోదరి ముగ్గురు తీవ్రంగా దాడి చేసి కొట్టటంతో గాయాలపాలయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు వన్‌టౌన్ చేపలచెట్టు సెంటర్ ప్రాంతంలో 10 ఏళ్ల బాలుడు ఇంట్లో తెలియకుండా రూ.200 తీశాడనే కోపంతో బుధవారం రాత్రి బాలుడ్ని కన్నతల్లి, తండ్రి, సోదరి అతని చేతులు, కాళ్లపై కొట్టారు. బాలుడు నొప్పి భరించలేక కేకలు వేయడంతో స్థానికులు బాలుడిని సమీపంలోని ఆర్ఎంపీ వద్ద ప్రాథమిక చికిత్స అందించారు. సమాచారం అందుకున్న చైల్డ్ లైన్, పోలీసులు బాలుడి మారుటి తండ్రి యాకోబు, తల్లి ఉషా, సోదరిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సెక్యూరిటీ గార్డుపై శునకం దాడి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఒక సెక్యూరిటీ గార్డుపై బుధవారం రాత్రి శునకం దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం శ్రీవారికి రాత్రి హారతి ఇచ్చే సమయంలో ఒక శునకం ఆలయంలోకి ప్రవేశించబోయింది. అయితే ఆ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న దేవస్థానం సెక్యూరిటీ గార్డు ఎం.శ్రీనివాస్ ఆ శునకాన్ని ఆలయంలోకి వెళ్లకుండా తరిమివేయడానికి ప్రయత్నించగా ఆ శునకం అతడిపై దాడి చేసింది. ఈ ఘటనలో శ్రీనివాస్ చేతి వేలికి గాయమైంది. ఆలయ సిబ్బంది అతడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి, చికిత్స అందించారు.

బాలిక పెళ్లిని అడ్డుకున్న అధికారులు

యలమంచిలి: మేడపాడులో బాలికకు పెళ్లి చేస్తున్నారనే సమాచారంపై బుధవారం అధికారులు వెళ్లి పెళ్లిని అడ్డుకున్నారు. మైనర్లకు పెళ్లి చేయడం నేరమని, ఆ విధంగా చేస్తే చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. బాలిక తల్లిదండ్రులు, బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి మేజర్ అయ్యేవరకు పెళ్లి చేయమని పత్రాలు రాయించారు. గ్రామ కార్యదర్శి మన్నే మాధురి, వీఆర్వో తోట శ్రీనివాసరావు, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్ యాడేపల్లి మహాలక్ష్మి, హెచ్‌సీ కృష్ణారావు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ గురుజు శైలజ, మహిళ పోలీస్ పోతుల జయ భాను లక్ష్మి ఉన్నారు.